


# మూగవేణువు

**- షర్మిల**

అదో కోస్తాపల్లె. ఉన్నది 50 గడప. మా ఊర్లో గుండెలేనివాడైనా ఉన్నాడేమో గానీ జెండాలేనివాడు లేడు. జెండాలేని ఒకే కుటుంబం ఉంది. అదే మా ఆచార్లుగారిది. ఆచార్లుగారు నల్లని నలుపు, ఆపైన నూనె రాసుకున్నట్టు ఉండేవాడు. ఆ వంటిమీద తెల్లని నామాలు. ఏదయినా బలిసిన గుళ్లో పూజారయితే బానపొట్టతో మిసమిసలాడుతూ ఉండేవాడేమో. మా ఊరయితే చిన్నదే గానీ భలే అందమైంది. ఊరి మధ్య అరెకరం ఆటస్థలం. ఊరు మొదలయ్యే చోట చెరువు, ఆ చెరువు నిండా కలకలలాడే కలవపూలు ఎర్రనివీ, తెల్లనివీను. నాతో చాలామంది వాదించి ఓడిపోయారు.మా ఊరి పొద్దుపొడుపులో ఉన్న అందం ఎక్కడా లేదని, అక్కడి నల్ల తుమ్మతోటలో పొద్దుకుంకేటప్పటి అందం కన్యాకుమారిలో కూడా లేదని బల్ల బజాయించి మరీ చెప్తాను. అసలు ఆ అందం చూసి తీరాల్సిందే. నల్లని తుమ్మ చెట్ల చాటునుంచి సూరీడు మా ఊరి దేవత రాజ్యలక్ష్మీ అమ్మవారి నుదుటి బొట్టల్లే ఎర్రగా మెరిసిపోతుంటాడు.

అన్నట్టు మా ఆచార్లుగారు శుక్రవారం పెట్టే ప్రసాదం రుచి నేనెక్కడా తిని ఎరగలేదంటే నమ్మండి. కానీ మరీ కాస్తంత ప్రసాదం పెట్టేవాడాయన. దీనికి నేనో విరుగుడు కనిపెట్టాను. అందరూ పది పైసలు ఐదు పైసలు దక్షిణ పళ్లెంలో వేస్తే నేను మా నాన్నను పీడించి మరీ పావలా కాసు వేసేదాన్ని. దానితో ఆయన ముఖం రూపాయి కాసులా తళతళలాడేది. ఫలితంగా మరికాస్త ప్రసాదం నా చేతుల్లో పడేది. ఆయన గుడితోపాటు అరుగు మీద బడికూడా నడిపేవాడు. ఆయన బళ్లో స్పెషాలిటీ ఏమిటంటే ఎక్కాలు ఆ చివరనుంచి ఈ చివరకు, ఈ చివరనుంచి ఆ చివరకు బట్టీపెట్టి అప్పచెప్పాలి. అలా చేయకపోతే తొడపాశాలు పెట్టేవాడు. డిక్టేషన్‌లో తప్పులు వస్తే తప్పుకో బెత్తం దెబ్బ తగిలేది. నాకు డిక్టేషన్ ఎప్పుడూ కరెక్ట్ వచ్చేది కానీ ఎక్కాలు పీకలదగ్గట పట్టేసేవి. తొడపాశాలు పెడదామంటే మా ఇంటినుంచి వచ్చే స్వయంపాకాలు గుర్తొచ్చో, మా నాయనమ్మ చేసే ఆగం భరించలేకో తెలీదు కానీ మా ఆచార్లుగారు అంత సాహసించలేకపోయేవాడు. ఆచార్లుగారినీ సంతాన నారాయణుడు అని అంటే సరిపోతుంది. నలుగురాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలతో వచ్చేపోయే చుట్టాలు, పక్కాలతో ఇల్లు రణగొణలాడుతూ ఉండేది. మా పంతులమ్మగారు ఎప్పుడు చూసినా మడి చీర కట్టుకుని అన్నం వార్చడమో, కూరగాయలు తరగడమో చేస్తూనే ఉండేది. కుంభాలకు కుంభాలు వండిపొయ్యడమే కానీ ఆమెకి ఇంకో పని చెయ్యడానికి తీరిక దొరికేది కాదు. ఆచార్లుగారి పిల్లల్లో కావేరి నా ఫ్రెండు. ఆ అమ్మాయి మా పల్లెలో పుట్టింది కానీ అదే ఏ కథా వర్క్ షాపు చేతుల్లోనో పడితే గొప్ప సస్పెన్స్ థ్రిల్లర్స్ రచించేది. ఆ అమ్మాయి ఏ విషయం చెప్పినా క్రైం, సస్పెన్స్ మిళాయించి మరీ కథలాగా చెప్పేది. నేను ఆ పిల్ల చెప్పేవన్నీ కళ్లు, నోరు అప్పగించి మరీ వింటూ ఉండేదాన్ని.

ఉదయాన్నే లేచి ఆచార్లుగారు విగ్రహాలమీద కవచాలు తీసి శుభ్రంగా నూతి దగ్గర బూడిద వేసి చింతపండుతో బంగారంలా మెరిసేలా తోమేవాడు. ఆ పనిలో కావేరి సాయపడేది. రోజూ నేను హాజరై పక్కనే నిల్చొని ఇవన్నీ చూసేదాన్ని. మా ఊరి గోపాలుడి వేణువు వెండిది. నా కయితే దాన్ని తీసి ఒక్కసారి ఊది చూడాలనిపించేది. ఒక రోజు కావేరి గుళ్లో గంటలు తుడిచేపనిలో ఉన్నప్పుడు నేను వెళ్లి నుంచున్నాను. కాస్సేపాగి



లోపల గర్భగుళ్లోకి వెళ్తానన్నాను. 'తప్పు! మీరు వెళ్లకూడదు' అంది కావేరి కంగారుగా. 'ఏం ఎందుకు వెళ్లకూడదు ఒక్కసారి వెళ్లి ముట్టుకుని వచ్చేస్తా' అని తెగించిన ధైర్యంతో గడపదాటి ఆ దేవిని ముట్టుకుని చటుక్కున వెనక్కు తిరిగి వచ్చేశాను. కావేరి భయంతో బిగుసుకుపోయింది. "మా నాన్న చూస్తే నిన్ను చంపేస్తాడు. ఈ సంగతి నేనూ ఎవరికీ చెప్పను నీవూ ఎవరికీ చెప్పకు" అంది. సరేలెమ్మన్నాను. మా ఆచార్లుగారికి ఓ బక్కచిక్కిన గేదె ఉండేది. మా ఊర్లో అందరి గేదెలు బలిసి ఉంటే మా ఆచార్లుగారి గేదె మటుకు అలా ఉసూరుమంటూ ఎందుకుంటుందో అర్థం అయ్యేది కాదు. దానిని మేపడం కావేరి డ్యూటీ. నేను ఆ అమ్మాయి వెనుకే ఉండేదాన్ని.

ఒక రోజు సాయంత్రం అరుగుమీద బడికి వెళ్లి లోపలికి తొంగి చూశాను. కావేరి మహా ఉత్సాహంగా ఉంది. దాపుడుకని ఉంచుకున్న బట్టలు తీసి కట్టుకుంది. ఆ అమ్మాయి నల్లటి బుగ్గలమీద చక్కగా పడే సొట్టలు ఇంకా అందంగా కనిపిస్తున్నాయి ఆ రోజు. ఎక్కడికైనా వెళ్తున్నావా కావేరీ ? అని అడిగాను. ' అవును మా అక్కావాళ్లతో సినిమాకు వెళ్తున్నాను అని చెప్పి గబగబా గోడకి ఉన్న సున్నం తీసి ముఖానికి రాసుకోవడం మొదలెట్టింది. " అదేంటి గోడ సున్నం మొఖానికి రాస్తున్నావు' తెల్లబోతూ అడిగాను. 'నీకు తెలుసా? అసలు పౌడరు సున్నంతోనే చేస్తారట, కాకపోతే వాసన కోసం ఏవో కలుపుతారు. అందుకే ఏదో తెల్లగా కనబడడానికి ఈ సున్నమే రాసుకుంటే పోలా' అంది. నిజమే! అన్నాన్నేను.

రోజూ నైవేద్యం పెట్టేసరికి మధ్యాహ్నాం ఒంటిగంటయ్యేది. ఆ తరవాత పిల్లాజెల్లా, చుట్టాలూ, పక్కాలూ తిన్నాక మా ఆచార్లుగారు, పంతులమ్మగారూ ఎంగిలిపడేవారు. ఈ లోగా మాటిమాటికీ మా ఆచార్లుగారు లోపలికెళ్లి బెల్లం ముక్క పత్రమ్మని పురమాయించేవాడు. బెల్లం ముక్క నోట్లో పెట్టుకుని పాఠాలు చెపుతున్న ఆయన్ని చూస్తే మాకు నోరూరేది. అసలు ఈ ఆచార్లు దేవుడికి పెట్టడానికి బెల్లం ఏమైనా మిగులుస్తాడా అని మా ఊరి రచ్చబండ పెద్దలు సణుక్కోవడం నాకు తెలుసు.

నేను అరుగుబడి నుంచి టౌన్‌లో ఉన్న కాన్వెంట్‌బడికి వచ్చేయడంతో అప్పటినుంచీ నాకూ మా ఊరికీ మధ్య దూరం పెరిగింది. అయినా అక్కడి జ్ఞాపకాలన్నీ సజీవంగా కళ్ల ముందు ఆడేవి. ఎన్నో ఏళ్లకి మా ఊరెళ్లాను. మా ఆచారి మాస్టారు ఏదో జబ్బు చేసి పోయాడు. పిల్లా మేకా దిక్కులేని వాళ్లయిపోయారు. మా ఊరు డబ్బు చేసింది. పెంకుటిళ్లు అన్నీ మేడలయ్యాయి. స్టార్ టి.వి.ఛానెళ్లు, గ్యాస్ కనెక్షన్‌లు లేని ఇల్లు లేదు. మా ఊరి దేముడికి ఇప్పుడు ఇత్తడి తొడుగు లేదు. అంతా వెండి తొడుగు, బంగారం నగలూ. మా పంతులమ్మగారు మాత్రం మడిచీర ముక్కతో అలా అన్నం వారుస్తూనే ఉంది. మా ఆచార్లుగారి ఇప్పటి గేదె కూడా అలా బక్కగానే ఉంది. కావేరీ బడి పిల్లలకి ప్రైవేట్లు చెబుతోంది.

ఆ సారి మా ఊరునుంచి వచ్చాక మా ఊరి అందం గురించి చెప్పడం మానేశాను. అసలు మా ఊరి అందం మీద అనుమానం వచ్చింది. మా ఆచార్లుగారికి బెల్లం మక్కలంటే అంత ఇష్టం ఏమీలేదని కేవలం ఆకలి చంపుకోవడానికే బెల్లం ముక్కలు తినేవాడని తెలిసాక మా ఊరి అందం గుర్తుకు రాలేదు. కావేరి గోడకు ఉన్న సున్నం మొఖానికి రాసుకోవడం గుర్తు వచ్చినప్పుడు మా ఊరు అంత అందమైంది కాదనిపించింది. మా ఊరి గోపాలుడి వెండి వేణువు మోగదని అది మూగదని తెలిసినప్పుడు మా ఊరేం బాగాలేదనిపించింది. మా ఊరి అందం మూగవేణువేనని అనిపించింది.